## రేపటి నుంచి ఆకాశవాణిలో ప్రసంగాలు

కొల్లాపూర్, అక్టోబర్ 1: ఆకాశవాణి హైదరాబాద్ 'ఏ,కేంద్రం ద్వారా ఈనెల 3, 10, 17, 24, 31తేదీల్లో ఉదయం 6:10గంటలకు తన ప్రసంగాలు ప్రసారమవుతాయని కొల్లాపూర్ మండలం ఎన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన కవి, రచయిత, తెలుగుభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి వేదార్థం మధుసూదన శర్మ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న నివృత్తి, 10న ఉత్తేజం, 17న స్ఫూర్తి, 24న విజయదశమి, 31న ప్రతిఫలం అనే అంశాలపై తన ప్రసంగాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తాను ఇప్పటివరకు ఆకాశవాణి ద్వారా 80కి పైగా ప్రసంగాలు చేశానని తెలిపారు. మారుమూల ప్రాంతానికి చెందిన తనకు అవకాశాలు కల్పిస్తున్న ఆకాశవాణి అధికారులు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## వృద్ధులకు పండ్లు పంపిణీ



కొల్లాపూర్ తాసీల్దార్ కార్యాలయంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీచారి, సీడీపీవో వెంకటరమణమ్మ

కొల్లాపూర్, అక్టోబర్ 1: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీవాణి విద్యాలయంలో ఇందిరాగాంధీ అభిమాన సంఘం ఉమ్మడి జిల్లా అ ధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు ఆదివారం వృద్ధులను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే స్త్రీ శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయంలో వృద్ధుల దినోత్సవాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీచారి, సీడీపీవో వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వ శాంతి వెల్ఫేర్ సొసైటీ వృద్ధాశ్రమం చైర్మన్ కృష్ణమోహన్, డీపీవో, సఖి కోఆర్డినేటర్, ఏఎన్ఎంలు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రుక్మద్దీన్, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖరాచారి పాల్గొన్నారు.

## మైసమ్మను దర్శించుకున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 1: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం జిల్లా నలుమూల నుంచి భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఈ ఆదివారం మైసమ్మ దేవతకు ఆదాయం పెరిగినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


లింగాలలో శ్రమదానం చేస్తున్న వైద్యులు , సిబ్బంది

లింగాల, అక్టోబర్ 1 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దూరమవుతాయని వైద్యాధికారి శివశంకర్ అన్నారు. ఆదివారం స్థానిక సీహెచ్‌సీలో శ్రమదానం నిర్వహించి ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొలిచిన పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివశంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఎక్సైజ్ దాడులు : సారా పట్టివేత


ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

అచ్చంపేటరూరల్, అక్టోబర్ 1: మండలంలోని గుంపన్‌పల్లి గ్రామశివారులో ఆదివారం సారా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. ఎక్సైజ్ సీఐ కథనం ప్రకారం.. మండలంలోని గుంపన్‌పల్లి గ్రామానికి నక్కెర్లపెంటకు చెందిన మాద్యా ప్లాస్టిక్ బాటిళ్లల్లో 7.5 లీటర్ల సారాను బైక్‌పై తరలిస్తుండగా సమాచారం మేర కు ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా సారాను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై బాలరాజు, సతీశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతనోత్సాహం

- కారెక్కుతున్న విపక్షాల శ్రేణులు
- రోజు రోజుకూ బలం పుంజుకుంటున్న గులాబీ దళం
- ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన 50మంది చిన్నకార్పాముల జూపల్లి వర్గీయులు


బీఆర్ఎస్‌లో చేరిన చిన్నకార్పాములకు చెందిన జూపల్లివర్గీయులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, అక్టోబర్ 1 : నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గులాబీ దళంలోకి వలసలు కడుతున్నారు. జూలై 1వతేదీ గిరిజనులకు పోడు భూములకు పట్టాలు పంపిణీ ప్రక్రియ మొదలుకొని నేటి వరకు గులాబీ దళంలోకి వెల్లువెత్తున్నారు. దీంతో గులాబీదళం పుంజుకుటుంది. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ప్రచారాస్త్రాలుగా చేపట్టిన ఆరు గ్యాంరెటీ పథకాల హామీలను ఆ సొంత పార్టీ శ్రేణులే విశ్వసించలేకపోతున్నారు.దీంతో హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పి కారెక్కుతున్నారు. తాజాగా పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాములలో మాజీ మంత్రి జూపల్లికృష్ణారావు వర్గీయులు 50 మంది కార్యకర్తలు, నాయకులు ఆదివారం కొల్లాపూర్‌లో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలను కప్పి సాదరంగా ఎమ్మెల్యే ఆహ్వానించారు. అయితే సెప్టెంబర్ 16న కొల్లాపూర్‌లో సీఎం కేసీఆర్ బహిరంగసభ జరిగిన తర్వాత బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజే పీ, ఇతర పార్టీల కార్యకర్తలు చేరికల పర్వం నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది. దీంతో గులాబీ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం రెట్టింపు అయిందని చెప్పాలి.

### కొనసాగుతున్న చేరికల పర్వం

ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వీపనగండ్ల మండలం బొల్లారం సర్పంచ్ పద్మమ్మ గురువారం హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో కారెక్కారు. అలాగే శనివారం అదే మండలం వల్లభాపురం గ్రా మంలో మాజీ మంత్రి జూపల్లివర్గీయులైన ఉప సర్పంచ్ రాంపోగుల సుజాత సం జీవతో పాటు మరో 20మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ దళంలోకి చేరారు. చిన్నంబావి మండలం చిన్నమారూర్ గ్రామానికి చెందిన 15మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. గులాబీ దళంలో చేరికల పర్వం ఊపందుకోవడంతో కారు యమ స్పీడ్‌తో దూసుకెళ్తున్నది. కొల్లాపూర్ నియోజకవర్గాన్ని 19 ఏండ్లుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా జూ పల్లి పాలించినా ప్రజలు ఆశించిన అభివృద్ధి చేయలేదన్న ఆపవాదు మూటగట్టుకున్నారు. తన వద్దకు ఏపని మీద వచ్చినా ఆయా గ్రామాల్లో ఉన్న తన అనుచర నాయకుడు చెబితేనే పని చేశాడని ఆరోపణలున్నాయి. గ్రామాల్లో ముఖ్యనాయకులను గుర్తించడం తప్పా పార్టీ కోసం కష్టపడి సైనికుల్లా పనిచేసిన సాధారణ కార్యకర్తలను గుర్తించలేని పరిస్థితి జూపల్లిదని విమర్శలు లేకపోలేదు. అందుకు భిన్నంగా ప్రస్తుత ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జనంతో మమేకమైపోతున్నారు. తన వద్దకు పని కోసం వచ్చే ఏ పార్టీవారైనా ఆప్యాయతతో పలుకరించడం, పార్టీలకతీతంగా ప్రజల్లో ఆదరాభిమానాలను చూరగొనడంతో ఎమ్మెల్యే బీరానికి అండగా బీఆర్ఎస్‌లో చేరికల పర్వం కొనసాగుతున్నది. ఇది వరకు ముక్కిడిగుండం, బోడబండతండా, ఎర్రట్టు బొల్లారం, మాచినేనిపల్లి, నార్లాపూర్, గూడెం, జూపల్లి సొంత గ్రామమైన పెద్దదగడ ఉపసర్పంచ్ చిన్నకోటయ్య, పలు వార్డుసభ్యులు, వెన్నచర్ల, జగన్నాథపురం, నక్కలపల్లి, తాళ్లనర్సింహాపురం, చుక్కాయపల్లి, కొల్లాపూర్ లో మైనార్టీలు, కోడేరు, ఎత్తం మాజీ సర్పంచ్ మిద్దెకృష్ణయ్యతో సహా వందలాదిమంది హస్తం పార్టీని వీడి ఇటీవల ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

### గులాబీ జెండాకే జైకొడుతున్న గిరిజనం

ఎన్నో దశాబ్దాలుగా పోడు భూములను నమ్ముకొని సాగుచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ వచ్చిన కొల్లాపూర్ నల్లమల అటవీప్రాంతంలోని గిరిజనులకు సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాల పంపిణీ ప్రక్రియను చేపట్టిన విషయం విధితమే. జూలై ఒకటో తేదీన కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని కోడేరు, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాల పరిధిలో పోడు భూముల్లో సాగులో ఉన్న 759 మంది లబ్ధిదారులకు 1783.80 ఎకరాలు పోడు పట్టాలను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పంపిణీ చేసిన విషయం విధితమే. మంత్రిగా జూపల్లి ఉండి కూడా తమకు పోడు భూములకు పట్టాలు ఇప్పించలేని అసమర్థుడని, గిరిజనులైన తమకు న్యాయం చేయలేదని జూపల్లిపై గిరిజనులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాతలు, ముత్తాల కాలంగా తాము పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, తమకు దేవుడి రూపంలో ఎమ్మెల్యే బీరం పట్టాలు ఇవ్వడంతో జీవితాంతం ఆయనకు అండగా ఉంటామని గిరిజనులు జైకొడుతున్నారు.

పోడు పట్టాలు పంపిణీ చేయడంతో ప్రభుత్వం తమకు రైతుబంధు పథకం డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో జమఅయ్యాయని, ఇంతకన్నా తమకు ఏం కావాలని గిరిజనులు అంటున్నారు. అయితే ఈ ప్రాంతంలోని గిరిజనులు ఎంతోకాలంగా జూపల్లికి మద్దతుని స్తూ వచ్చినా గిరిజనులు పోడు పట్టాల పంపిణీతో ఎమ్మెల్యే బీరానికి జైకొడుతున్నారు. ఏదీఏమైనప్పటికీ కొల్లాపూర్ నియోజకవర్గంలో గులాబీ దళం పుంజుకుంటుండడంతో కారు యమ స్పీడ్‌తో ముందుకుదూసుకెళ్తుండడంతో ఒక బలమైన శక్తిగా రూపుదిద్దుకుంటుందని చెప్పవచ్చు.

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థుల శ్రమదానం

కొల్లాపూర్,అక్టోబర్ 1 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ అధ్యక్షతన విద్యార్థులు ఆదివారం శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు , చెత్తాచెదారం తొలగించడం, మొక్కల చుట్టూ పాదులు చేసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన భారతదేశాన్ని నిర్మించడంలో యువత ముందుండాలని, వారంలో ఒకరోజు గంటపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ ,ఇతరులు ఉంచుకునేటట్లు అవగాహన కల్పిస్తూ శ్రమదానం ఆవశ్యకతను వివరించాలని సూచించారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో కుర్మయ్య, విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొల్లాపూర్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు


కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

### పెద్దకొత్తపల్లి మండలంలో..

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 1: మండలంలోని కల్వకోల్, సాతాపూర్, చెన్నపురావుపల్లి, పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల తదితర గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సర్పంచులు వీధుల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కృష్ణయ్య మాట్లాడుతూ వారం రోజుల నుంచి గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా చివరిరోజు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు, పాల్గొన్నారు.


చెన్నపురావుపల్లిలో పాల్గొన్న ఎంపీడీవో, సర్పంచ్


నాగులపల్లిలో రోడ్లను శుభ్రం చేస్తున్న సర్పంచ్, ప్రజలు

### కోడేరు మండలంలో..

కోడేరు అక్టోబర్ 1: మండల కేంద్రం, నాగులపల్లి గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో బాలచందర్‌సుజనా, కోడేరు నాగులపల్లి సర్పంచులు వెంకటస్వామి, వెంకటస్వామి, వార్డుసభ్యులు, రైతు బంధు సమితి అధ్యక్షుడు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

### కేజీబీవీలో విద్యార్థినులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ

కొల్లాపూర్,అక్టోబర్ 1: పట్టణంలో ఆదివారం పలు చోట్ల నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్‌గంట-ఏక్ సాత్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీచారి, కమిషనర్ రాజయ్య పాల్గొన్నారు. పట్టణంలోని కేజీబీవీ, గిరిజన బాలికల హాస్టల్ ఆవరణలో పారిశుధ్య పనులను చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులు కేజీబీవీలో విద్యార్థినులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ జమీర్‌పాషా, ఫారూఖ్, సతీశ్‌కుమార్, జవాన్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.